విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

ప్రశ్నించడం అందరి హక్కు...

# పెన్ సత్తా

PEN SATTA Telugu Daily

సంపుటి : 4 | సంచిక :32 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శుక్రవారం 26 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool





## యువతకు క్షమాపణ చెప్పి వెంటనే రాజీనామా చేయాలి

- ధర్మేంద్ర ప్రధాన్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- కేంద్ర ప్రభుత్వ తీరుపై రాహుల్ గాంధీ మండిపాటు
- ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి బదులుగా విమర్శిస్తోందని ఆరోపణ
- విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను ఎప్పటికీ గళం విప్పుతూనే ఉంటానన్న ప్రతిపక్షనేత



## అంతర్జాతీయ విమానాల్లో 'హబ్ అండ్ స్పోక్' మోడల్

- ప్రపంచ అవకాశాలకు భారత్ మరింత చేరువ : మోదీ
- వారణాసి నుంచి తొలి 'హబ్ అండ్ స్పోక్' విమాన సేవలకు శ్రీకారం
- ఆరు వారాల్లో మరో ఆరు నగరాలకు సేవల విస్తరణ
- వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడులకు కొత్త అవకాశాలు వస్తాయన్న ప్రధాని

### తుంగభద్ర నది మూడు రాష్ట్రాల్లో

# లక్షలాది మందికి జీవనోపాధి



- కర్ణాటక హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లు ప్రారంభం
- కొత్త గేట్లు ప్రారంభించిన కర్ణాటక, ఏపీ, తెలంగాణ సీఎంలు
- నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల అమరిక

**అమరావతి**

బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన తుంగభద్ర పునరుజ్జీవం సంతరించుకుంది. కొత్తగా ఏర్పాటు చేసిన జలాశయం గేట్లను కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం హోస్పేటలో జరిగిన ఈ కార్యక్రమం సందడి వాతావరణంలో సాగింది. అంతకుముందు ముగ్గురు సీఎంలతో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్



### యువతను మాదకద్రవ్యాల నుంచి

# రక్షించాలి

- హోం మంత్రి వంగలపూడి అనిత
- మాదకద్రవ్యాల వ్యసనం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పు
- ఇది యువతలోని ప్రతిభ, ఆరోగ్యం మరియు ఆశయాలను నాశనం చేస్తుంది

**అమరావతి**

యువతను మాదకద్రవ్యాల వ్యసనం అనే ప్రమాదం నుండి రక్షించాల్సిన అత్యవసర అవసరం ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం కేవలం సామాజిక సమస్య మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పని, ఇది యువతలోని ప్రతిభ, ఆరోగ్యం మరియు ఆశయాలను నాశనం చేస్తుందని అన్నారు. విఐటి--ఏపీ విశ్వవిద్యాలయంలో ఈగల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ

వివరాలు 2లో..

## పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేదు

- వివాదం వేళ కేంద్రం క్లారిటీ
- పాస్‌పోర్ట్ ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, దాన్ని పౌరసత్వానికి ప్రూఫ్‌గా పరిగణించలేమన్న ఎంఈఏ అధికారి
- ఈ వ్యాఖ్యలపై భగ్గుమన్న విపక్ష నేతలు.. తాజాగా వివరణ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం



### రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు

# వెళుతోంది



- డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్న జగన్
- వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపాటు
- 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని విమర్శ

**అమరావతి**

ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని, రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని

వివరాలు 2లో..



## చైనా లక్ష్యంగా భారత్ కొత్త వ్యూహం

- దూరం నుంచే దెబ్బ
- చైనాను దృష్టిలో పెట్టుకుని రక్షణ వ్యూహాలు రూపొందిస్తున్న భారత్
- దీర్ఘశ్రేణి క్షిపణుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- భారత్ వద్ద 24 అగ్ని-5 క్షిపణులు ఉన్నట్లు SIPRI అంచనా
- అగ్ని-5 పరిధి సుమారు 5,000 కిలోమీటర్లు
- దేశీయ రక్షణ ఉత్పత్తి రూ.1.78 లక్షల కోట్లకు పెరుగుదల
- డ్రోన్లు, సైబర్ యుద్ధ సామర్థ్యాలపై

## వెనిజులాలో భూకంప విలయం..

- 164 మంది మృతి.. 971 మందికి పైగా గాయాలు
- 7.2, 7.5 తీవ్రతలతో వరుస ప్రకంపనలు
- లా గ్వైరా ప్రాంతంలో భారీ విధ్వంసం
- అనేక భవనాలు కూలిపోవడంతో సహాయక చర్యలు
- ప్రధాన విమానాశ్రయం, మెట్రో సేవలకు అంతరాయం
- పలు దేశాల నుంచి సహాయక బృందాల రాక



# ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ

- అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా పక్కా ప్రణాళికలు
- స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో సర్కారు అడుగులు
- మంత్రి కందుల దుర్గేశ్‌ను కలిసిన ఏపీ ఛాంబర్స్ ప్రతినిధి బృందం
- పర్యాటక రంగం బలోపేతానికి పలు కీలక సూచనలు



**అమరావతి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమైంది. స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలతో పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించనుంది. ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడం, పర్యాటక రంగాన్ని బలోపే తం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్

వివరాలు 2లో..



## రష్యాకు భారత పెట్రోల్..

- ఉక్రెయిన్ దాడుల ప్రభావం!
- ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో దెబ్బతిన్న రష్యా రిఫైనరీలు
- భారత్ నుంచి పెట్రోల్ దిగుమతులకు రష్యా ప్రణాళిక
- దిగుమతి కంపెనీలకు సబ్సిడీల ప్రతిపాదన
- జూన్ 2026లో భారత్ రష్యా చమురు కొనుగోలు రికార్డు స్థాయికి
- రష్యాలో రోజుకు 25 వేల టన్నుల పెట్రోల్ కొరత
- ఇంధన ధరలు భారీగా పెరుగుతున్న పరిస్థితి

# తుంగభద్ర నది మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది

-మొదటిపేజీ తరువాయి

నీటి సమస్యలపై చర్చించారు. మూడు రాష్ట్రాలకు మేలు చేసే తుంగభద్ర జలాశయం కొత్త గేట్లతో కళకళలాడుతోంది. కర్ణాటకలోని హోస్పేటలో నూతన గేట్ల ప్రారంభోత్సవం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. కేంద్రమంత్రితో పాటు మూడు రాష్ట్రాల సీఎంలు, నీటిపారుదల శాఖా మంత్రులు, అధికారులు తరలివచ్చారు. ప్రాజెక్టు 17వ గేటును కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, 8వ గేటును కర్ణాటక సీఎం డీకే శివకుమార్, 19వ గేటును ఏపీ సీఎం చంద్రబాబు, ప్రాజెక్టు 20వ గేటును తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



### ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడారు. "తుంగభద్ర మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం ఓ చరిత్ర. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర తాగు, సాగు నీరు ఇచ్చింది. ఈ నది లేకపోతే చాలా సమస్యలు వచ్చేవి.

జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశంలో నదుల అనుసంధానం చేయాల్సిన బాధ్యత ఉంది. గంగ, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారత్ అన్‌స్టాపబుల్‌గా దూసుకెళ్తుంది. సీఆర్ పాటిల్‌కు నదులు అనుసంధానం చేసిన అనుభవం ఉంది. జాతీయ ప్రాజెక్టుగా గోదావరి-కావేరిని కేంద్రం అనుసంధానం చేయాలి" అని చంద్రబాబు అన్నారు.

"తుంగా పానం - గంగా స్నానం ప్రసిద్ధ సామెత. తాగడానికి స్వచ్ఛంగా, తీయగా తుంగా నది ఉంటుంది. బహు పుణ్యానికి గంగా నది గొప్పది. తుంగభద్ర నది, మూడు రాష్ట్రాల్లో లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తోంది. ప్రాజెక్టులంటే ఆధునిక దేవాలయాలు వాటిని పరిరక్షించుకోవాలి. ప్రాజెక్టులు బాగుంటేనే భవిష్యత్తు తరాలకు భరోసా ఉంటుంది. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరినీ అభినందిస్తున్నా. సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు సీఎంలు కలవడం చరిత్ర. మూడు రాష్ట్రాలకు నాందిగా మారుతుంది. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు తుంగభద్ర సాగు, తాగునీరు ఇచ్చింది. తుంగభద్ర లేకపోతే చాలా ప్రమాదం వచ్చేది. జలవనరుల సంరక్షణ, సమర్థ నీటి నిర్వహణ మనందరి బాధ్యత. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది." - సీఎం చంద్రబాబు

### నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం

తుంగభద్ర నది ఒడ్డున బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. "తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం, అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నా" అని రేవంత్?రెడ్డి తెలిపారు.

### ఆధునిక సాంకేతికతతో ప్రస్తుత డ్యామ్‌లు

ప్రస్తుత డ్యామ్‌లు ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్నాయని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. 73 ఏళ్ల క్రితం మట్టితో నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ బాగుందని చెప్పారు. "ఈ ప్రాజెక్టులో ఒక్క గేటు కొట్టుకుపోవడం వల్ల అన్ని గేట్లూ మార్చాల్సిన పరిస్థితి వచ్చింది. నర్మద, సరోవర్ జలాలు మిళితం చేసి నదుల అనుసంధానం చేపట్టాం. ఈ ప్రక్రియతో గుజరాత్‌లో నదీజలాలు సమృద్ధిగా ఉన్నాయి. రూ.లక్ష కోట్లతో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 3 నదులు అనుసంధానం చేపట్టాం" అని సీఆర్ పాటిల్ అన్నారు.

### ప్రాజెక్టు చరిత్ర

జీవనాడిగా పేరొందిన తుంగభద్ర ప్రాజెక్టు నిర్మించి 73 ఏళ్లు పూర్తయ్యాయి 2024 ఆగస్టులో వచ్చిన వరద వల్ల ఈ ప్రాజెక్టు స్పిల్ వేలోని 19వ గేటు కొట్టుకుపోయింది. అప్పటికప్పుడు నీటి వృథాను అడ్డుకునేందుకు సీఎం చంద్రబాబు సూచనతో సీనియర్ ఇంజనీర్ కన్నయ్యనాయుడు నేతృత్వం వహించి స్టాప్ లాక్ గేటు అమర్చారు. స్పిల్ వే గేట్లు అన్నీ మార్చాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇవ్వడంతో ఆ తర్వాత కాలంలో

# పవన్ కత్తి లేకుండా వచ్చే ఎన్నికల్లో యుద్ధానికి దిగుతున్నారా?

**విజయవాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ వద్ద అస్త్రాలన్నీ దాదాపుగా ఇప్పటికే వాడేశారు. వచ్చే ఎన్నికల్లో ఇక వాడేందుకు ఎలాంటి అస్త్రాలు ఆయన వద్ద లేదు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి ఏం చెప్పగలుగుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతం వేరు. ప్రస్తుతం వేరు. భవిష్యత్ మరోలా ఉంటుంది. గత మూడు ఎన్నికల్లో తాను అధికారంలో లేకపోవడంతో ప్రజల వద్దకు వెళ్లి చెప్పేందుకు తగిన అంశాలున్నాయి. కానీ ఈసారి మాత్రం ఆయన అన్ని ఆయుధాలను వాడేశారు. మిగిలింది తమకు మరోసారి అధికారం ఇస్తే అభివృద్ధి సంక్షేమం అందిస్తామని మాత్రమే చెప్పగలిగేందుకు అవకాశముంటుంది.. 2014లో జనసేన పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ నాడు పోటీ చేయలేదు. నాడు టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చారు. అనుభవమున్న నేతతో పాటు, నాడు మోదీ చరిష్మా పట్ల ఆకర్షితుడైన పవన్ కల్యాణ్ వారికి మద్దతు పలికారు. 2019 ఎన్నికలకు వచ్చే సరికి టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మరొక కూటమిని ఏర్పాటు చేసుకుని బీజేపీ, టీడీపీలపై విమర్శలు చేశారు. కానీ నాడు పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు స్థానాలలోనూ ఓటమి చెందారు. జనసేన ఒకే ఒక స్థానం నుంచి గెలిచింది. 2024 ఎన్నికలకు వచ్చే సరికి చంద్రబాబు అరెస్ట్... టీడీపీ, బీజేపీతో జనసేన జట్టుకట్టడంతో కొంత ఆయుధాలు పుష్టిగా పవన్ కు లభించాయి. 2019 నుంచి వైసీపీ అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. 30 వేల మంది యువతులు మాయం అయ్యారని, లా అండ్ ఆర్డర్ దెబ్బతినిందని, అభివృద్ధి ఆగిపోయిందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవంటూ జనంలోకి వెళ్లగలిగారు. తాము అధికారంలోకి వస్తే యువతతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని బహిరంగ సభల్లో చెప్పేందుకు వీలు కలిగింది. అయితే వచ్చే ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మాత్రమే పవన్ కల్యాణ్



చెప్పగలరు. మరొక పార్టీని అధికారంలోకి రానివ్వవద్దని చెప్పడానికి పవన్ కల్యాణ్ వద్ద ఎటువంటి ఆయుధాలు లేవు. దీంతో పవన్ కల్యాణ్ ఆయుధాలు లేకుండా యుద్ధానికి దిగాల్సి వస్తుందన్న పరిస్థితి వస్తుంది. మరి వచ్చే ఎన్నికల్లో ప్రజలు, కాపు సామాజికవర్గం, అభిమానులు ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి.

### నేతల్లో టెన్షన్

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ చాలా మంది నేతలు సంతోషంగా లేరు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు మూడుసార్లు అధికారంలో ఉన్నప్పటి పరిస్థితికి చాలా తేడా వచ్చిందంటున్నారు. పార్టీ నాయకత్వ వైఖరి మారడమే కాకుండా, పార్టీ కేంద్ర కార్యాలయం ఇస్తున్న నివేదికలపైనే చంద్రబాబు ఎక్కువ ఆధారపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఇచ్చే ఫీడ్ బ్యాక్ ను చూసి నాయకత్వం నిర్ణయాలు తీసుకంటుందన్న ఆరోపణలు సోషల్ మీడియాలోవెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు, గంగాధర నెల్లూరు నియోకవర్గ ఎమ్మెల్యేలు బహిరంగంగానే దీనిపై ఆరోపణలు చేయడం విశేషం. ఇవే ఆరోపణలు అనేక మంది నేతలు ఆఫ్ ది రికార్డుగా చేస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు సామర్థ్యం, అనుభవంపై నేతలకు నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం చంద్రబాబు ఇతర పార్టీల పై ఆధారపడుతుండటంతో కొంత నేతలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ దక్కుతుందో? లేదో? అన్న టెన్షన్ కూడా వారిలో ఉంది. మిత్రపక్షాలు వత్తిడి తెస్తే ఏ నియోజకవర్గాన్ని అయినా వారికి అప్పగించేందుకు సిద్ధంగా ఉండేలా చంద్రబాబు వ్యవహార శైలి ఉందని నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే గతంలో మాదిరిగా ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలో నేతలు ముందుకు రావడం లేదు. ప్రధాన రీజన్ ఇక పార్టీలో తమకు ప్రాధాన్యత ఉంటుందో లేదో అన్న అనుమానమే వారిని సైలెంట్ గా మార్చేసిందంటున్నారు. మరొకవైపు చంద్రబాబు వ్యూహంపై అనేక మంది కార్యకర్తలు, నేతలకు నమ్మకం మాత్రం సడలలేదు. చంద్రబాబు అనేక సార్లు పార్టీ ఓటమి పాలయినా తిరిగి అధికారంలోకి వచ్చేలా చేయగలడంలో సక్సెస్ అయిన తీరును చూసి నేతలు నమ్మకంతో ఉన్నారు. అలాంటి వారికి కూడా ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ 175 నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్, ఓటు బ్యాంకు ఉంది. అలాంటి సమయంలో గెలుపోటములపై ఆధారపడకుండా పార్టీ నియోజకవర్గాల్లో బలహీన పడకుండా చేయాల్సిన బాధ్యత కూడా చంద్రబాబుపైనే ఉంది. మరి రానున్న కాలంలో

# రైల్వేజంక్షన్ గా కుప్పం

**తిరుపతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో కొత్త రైల్వే జంక్షన్ అందుబాటులోకి రానుంది. రెండేళ్లలో కుప్పం రైల్వే జంక్షన్‌గా మారనుంది. కర్ణాటకలోని మారికుప్పం నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకూ కొత్త రైల్వేట్రాక్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పనులలో రైల్వే అధికారులు వేగం పెంచారు. ప్రస్తుతం ఈ మార్గంలోని భూములను చదును చేసే పనులు జరుగుతున్నాయి. కర్ణాటక సరిహద్దుల నుంచి ఏపీ సరిహద్దు వరకు భూమిని చదును చేసే పనులను చేపడుతున్నారు. ఇందులో ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి . అలాగే బిసానత్తం నుంచి కుప్పం వరకు 18 కిలోమీటర్ల మేరకు పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం 269 ఎకరాల భూమిని సేకరించారు. ఈ నూతన రైలు మార్గం ఏర్పాటు కోసం రూ.363 కోట్లు అంచనాలతో పనులు జరుగుతున్నాయి. 2028 మార్చికల్లా పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులలో ఉంటుంది కుప్పం. రెండు రాష్ట్రాలకు సుమారుగా 30 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. చెన్నై బెంగళూరు రైల్వే మార్గంలో కుప్పం రైల్వేస్టేషన్ ఉండటంతో.. రోజూ పదుల సంఖ్యలో రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వేశాఖ కుప్పం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలోనే 2011లో కుప్పం - మారికుప్పం మధ్యన కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేశారు.23.7 కి.మీ. మేరకు కుప్పం రామకుప్పం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు రైల్వేశాఖ అధికారులు ప్రణాళికలు రచించారు. కుప్పం, మల్దేపల్లె, నక్కనపల్లి, గుండ్లసాగరం, కనమనపల్లె, అగరం, కుప్పిగానిపల్లి, కోటచెంబగిరి, పొగురుపల్లె, బిసానత్తం, అత్తిసత్తం మీదుగా మారికుప్పం వరకూ ఈ ట్రాక్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసింది. అలాగే మారికుప్పం ప్రాంతం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యి కుప్పం-మారికుప్పం రైల్వేట్రాక్ అందుబాటులోకి వస్తే.. ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. అలాగే కుప్పం రైల్వేస్టేషన్ జంక్షన్‌గా రూపుదిద్దుకుంటుందని

## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది

-మొదటిపేజీ తరువాయి

రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023-24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి.. కూటమి పాలనలో 2024-25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025-26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని... ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ

-మొదటిపేజీ తరువాయి

ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా పర్యాటక రంగాభివృద్ధిపై పలు కీలక సూచనలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు.

### సీఎం, డిప్యూటీ సీఎంల మార్గదర్శకత్వంలో

రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధికి సంబంధించి కీలక ప్రకటనలు చేశారు. త్వరలోనే రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లు, ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని మంత్రి దుర్గేశ్ తెలిపారు. జులై రెండవ వారంలో పర్యాటక శాఖతో ప్రత్యేకంగా భేటీ కానున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి సూచనలు, మార్గదర్శకాలతో తదుపరి కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్‌లో జరగనున్న 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' సమావేశంపై అధ్యయనం చేసి ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు.

### ఏపీ ఛాంబర్స్ చేసిన కీలక ప్రతిపాదనలు ఇవే

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ పలు ముఖ్యమైన సూచనలు చేసింది. పరిశ్రమలు, హాస్పిటాలిటీ, ట్రావెల్, ఏవియేషన్, లాజిస్టిక్స్ రంగాలు, ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులతో కలిపి ఒక 'టూరిజం స్టాక్‌హోల్డర్ అడ్వైజరీ కౌన్సిల్'ను ఏర్పాటు చేయాలని కోరింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 30 లక్షల మంది ప్రవాసాంధ్రులను భాగస్వాములను చేయాలని, అంతర్జాతీయ రోడ్‌షోల ద్వారా 'విజిట్ ఏపీ' ప్రచారాన్ని గ్లోబల్ స్థాయిలో ప్రమోట్ చేయాలని సూచించింది.

రూ.50 కోట్ల లోపు వ్యయంతో చేపట్టే ఎంఎస్ఎంఈ పర్యాటక ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని పేర్కొంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక 'ఫాస్ట్ ట్రాక్' విధానం తీసుకురావాలని తెలిపింది. భద్రతా ప్రమాణాలతో కూడిన సింగిల్-విండో రిజిస్ట్రేషన్ ప్రక్రియను తీసుకురావాలని, వాటిని పర్యాటక శాఖ అధికారిక పోర్టల్ ద్వారా ప్రమోట్ చేయాలని చెప్పింది. ప్రైవేట్ భూముల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చేటప్పుడు ప్రమోటర్ల ఆర్థిక బలం, వారి గత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపింది.

### కొత్త పర్యాటక సర్క్యూట్‌ల అభివృద్ధి

రాష్ట్రంలోని పలు ప్రాంతాలను కలుపుతూ పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేయాలని ప్రతినిధులు కోరారు. విజయవాడ-అమరావతి-సూర్యలంక - పాండురంగాపురం - ఓడరేవు - చీరాల ప్రాంతాలను కలుపుతూ బీచ్ కారిడార్ అభివృద్ధి చేయాలని అన్నారు. విశాఖపట్నం - అరకులోయ సర్క్యూట్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. గండికోట - బెలూమ్ గుహలు - యాగంటి టూరిజం సర్క్యూట్‌గా మార్చాలని కోరారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న లేపాక్షి, గండికోట, బెలూమ్ గుహలకు యునెస్కో గుర్తింపు వచ్చేలా ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

### మేనేజ్‌మెంట్ కమిటీలు, క్రూజ్ ఆపరేటర్లతో చర్చలు

ప్రధాన పర్యాటక ప్రాంతాలలో స్థానిక ప్రజలు, అధికారులు, ఆపరేటర్ల భాగస్వామ్యంతో 'డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ కమిటీలు' వేయాలని ప్రతిపాదించారు. ప్రత్యేక యాత్రా సర్క్యూట్‌ల కోసం రైల్వేలు, ఎయిర్‌లైన్స్, క్రూజ్ ఆపరేటర్లతో వెంటనే చర్చలు జరపాలని కోరారు. ఏపీ ఛాంబర్స్ చేసిన ఈ ప్రతిపాదనలపై మంత్రి కందుల దుర్గేశ్ సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న పర్యాటక ప్రాజెక్టుల క్లియరెన్స్‌ను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. పర్యాటక ప్యాకేజీల ప్రమోషన్ కోసం ఏపీ ఛాంబర్స్ నెట్‌వర్క్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో అందరి సమన్వయంతో పర్యాటక రంగాన్ని అగ్రగామిగా నిలబెడతామన్నారు.

## యువతను మాదకద్రవ్యాల నుంచి రక్షించాలి

-మొదటిపేజీ తరువాయి

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కఠిన చర్యలను ప్రశంసిస్తూ, రాష్ట్రం సాధించిన "జీరో గంజాయి సాగు" విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అక్రమ గంజాయి సాగు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల నిర్మూలనలో ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ, ముఖ్యంగా ఈగల్ బందాలు నిరంతరం చేస్తున్న కషిని ఆమె అభినందించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ చరిత్రను ప్రస్తావిస్తూ, 1980ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య వేగంగా విస్తరించిందని, అప్పటి నుండి సమాజాలకు పెద్ద సవాలుగా మారిందని మంత్రి పేర్కొన్నారు. ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో 'జీరో గంజాయి సాగు' సాధన నిరంతర అమలు చర్యలు, నిఘా ఆధారిత ఆపరేషన్లు మరియు ప్రజల భాగస్వామ్య ఫలితం. మా లక్ష్యం కేవలం చట్ట అమలు మాత్రమే కాదు; యువత జీవితాలను రక్షించడం, సమాజంలో అవగాహన పెంపొందించడం, భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల ముప్పు నుండి కాపాడడం కూడా అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఈగల్ సెల్ ఎస్పీ నాగేశ్ బాబు, ఈగల్ సెల్ ఎస్పీ శస్వరూపారాణి, విఐటి--ఏపీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర, ఖదీర్ పాషా డిప్యూటీ డైరెక్టర్ (స్టూడెంట్ వెల్ఫేర్) తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాణి నిధులు షిర్డికి ఇవ్వడం లేదా

**విజయవాడ :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల నుంచి భారీ సంఖ్యలో విరాళాలు అందుతున్నాయి. ఈ నిధులతో వెంకన్న ఆలయాలతో పాటు ఇతరత్రా ఆలయాల నిర్మాణం, అభివృద్ధి, ఆయా ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు సమర్పిస్తున్న విరాళాలను తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలక మండలి నిర్ణయం మేరకు వెచ్చిస్తున్నారు. అయితే షిరిడీ సాయి మందిరాలకు ఈ నిధులు అందడం లేదు. ఇదే విషయంపై తాజాగా వచ్చిన ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చిన ఏపీ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ట్రస్టు నిధుల వినియోగంపై మరోమారు స్పష్టత ఇచ్చారు.శ్రీవాణి నిధులను హిందూ ధర్మశాస్త్రంలో పేర్కొన్న ఆలయాలకు మాత్రమే వెచ్చించాల్సి ఉంది. ఈ నిబంధన మేరకే టీటీడీ నిర్ణయం తీసుకుంటూ ఉంది. తిరుమలతో పాటు ఇతరత్రా హిందూ ఆలయాలన్నింటికీ దాదాపుగా ఈ ట్రస్టు నిధులను వెచ్చించే అవకాశం ఉంది. అయితే షిరిడీ సాయి ఆలయాల విషయానికి వచ్చేసరికి ఈ ట్రస్టు నిధులను వెచ్చించడానికి వీల్లేని పరిస్థితులు ఉన్నాయి. ఎందుకంటే షిరిడీ సాయి ఆలయం హిందూ ధర్మశాస్త్రంలో పేర్కొనబడలేదు. హిందూ ధర్మశాస్త్రాల్లో పేర్కొన్న దేవాదిదేవుల ఆలయాల వృద్ధి కోసం మాత్రమే ఈ నిధులు వెచ్చించాలని ఓ స్పష్టమైన నిబంధన అమలు అవుతోంది.ఇవే అంశాలను ప్రస్తావించిన మంత్రి ఆనం? అయినా శ్రీవాణి ట్రస్టు నిధుల కోసం వేచి చూసే పరిస్థితి షిరిడీ సాయి ఆలయానికి లేదని చెప్పారు. హిందూ దేవుళ్లకు కేవలం హిందువులు మాత్రమే భక్తులుగా కొనసాగుతుండగా? షిరిడీ సాయికి హిందువులతో

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో మరింత వేగం పెంచాలి.

- ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలి.
- ఎస్ఐఆర్ పురోగతి పై సమీక్ష నిర్వహించిన మంత్రి సవిత.
- బూత్ ఇంచార్జిలు, బీఎల్ఏలతో మంత్రి సవిత సమీక్ష సమావేశం.

**పెనుకొండ, పెన్ సత్తా, జూన్ 25:** ఎస్ఐఆర్ కార్యక్రమంలో మరింత వేగం పెంచాలని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో సోమందేపల్లి, పెనుకొండ మండలాలకు చెందిన బూత్ ఇంచార్జిలు, బీఎల్ఏలు, ముఖ్య నాయకులతో రాష్ట్ర బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతి పై మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు, ఓటరు జాబితాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాల నమోదు ప్రక్రియ పై నాయకులతో చర్చించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం అమలులో మరింత వేగం పెంచాలని, ప్రతి ఇంటిని సందర్శిస్తూ అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని బూత్ ఇంచార్జిలు, బీఎల్ఏలు, పార్టీ నాయకులకు మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించడంతో పాటు పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలు, స్థానిక పరిస్థితులు, ఓటర్ల అభిప్రాయాలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వానికి తెలియజేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ ఇంచార్జిలు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రత్యేక అవసరాల పిల్లల వర్క్ షాప్ సందర్శించిన సుందరపు



**విజయవాడ, పెన్ సత్తా, జూన్ 25:**ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సంక్షేమం, విద్యా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. అసెంబ్లీలో భవిత సెంటర్ల బలోపేతం, అటిజం, ఇతర ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు మెరుగైన సేవలు అందించాలనే అంశాల పై పలుమార్లు విజయ్ కుమార్ గళం విప్పారు. ఈ సేవా దృక్పథంలో భాగంగా నేడు విజయవాడ లోని ఆంధ్ర లయోలా కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక పిల్లల వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పిల్లలను, వారి తల్లిదండ్రులను అభినందించి ప్రోత్సహించారు. ప్రత్యేక పిల్లల అభివృద్ధి కేవలం కుటుంబాల బాధ్యత మాత్రమే కాకుండా, సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 25:** భారత రాష్ట్రపతి ఈ నెల 30 వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖలు అత్యంత అప్రమత్తతతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల పై జిల్లా యంత్రాంగం, యూనివర్సిటీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, రాష్ట్రపతి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమ వేదిక, భద్రతా ఏర్పాట్లు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమం విశాఖపట్నంలోని వీ-కన్వెన్షన్, నోవోటెల్‌లో జరగనున్న నేపథ్యంలో వేదిక వద్ద అన్ని మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రపతి కార్యాలయం ఆమోదించిన కార్యక్రమ షెడ్యూల్‌కు అనుగుణంగా ప్రతి ఏర్పాటును సమయపాలనతో పూర్తి చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య బృందాలు, అంబులెన్సులు, ఫైర్ సర్వీసెస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పర్యటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రపతి భవన్ అధికారులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం కోసం జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరిని నోడల్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు సంపూర్ణ బాధ్యతతో పనిచేసి, అప్పగించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, ట్రైబల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మిశ్రా, ఇతర ఆచార్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించిన మంత్రి సవిత.

**గోరంట్ల, పెన్ సత్తా, జూన్ 25:** గోరంట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాల పై రాష్ట్ర బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలం లోని ప్రతి బూత్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాల పురోగతిని బూత్ వారీగా సమీక్షించి, ఓటర్ల వివరాల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల అంశాల పై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి బాధ్యులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.



## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ.





**మంగళగిరి, పెన్ సత్తా, జూన్ 25:**టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (ఏపీటిఎస్) ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో
పయ్యావుల కేశవ్, మన్నవ మోహనకృష్ణ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో వెంటనే ఫోన్ లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసర మైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా భూ సమస్యలు, వెబ్‌ల్యాండ్ రికార్డుల లోపాలు, అక్రమ ఆన్‌లైన్ ఎంట్రీలు, అధికారుల నిర్లక్ష్యం పై వచ్చిన ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్, మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక మంది ప్రజలు అన్యాయానికి గురయ్యారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు అధికారుల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను నేరుగా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చే వేదికగా గ్రీవెన్స్ కార్యక్రమం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీ పై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి, సమస్యలు పరిష్కారమయ్యే వరకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, అభివృద్ధే చంద్రబాబు ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.

# ప్రమాణస్వీకారం చేసిన రాజ్యసభ సభ్యులకు శుభాకాంక్షలు ఎంపీ







**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 25:**రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన చింతకాయల విజయ్, లింగమనేని రమేష్, పరిమళ్ నత్వానీ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన పార్లమెంట్ సభ్యుడు, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సిఎం రమేష్. ఈ సందర్భంగా దిల్లీ లో వారితో కలిసి భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ సభాపతి సీ.పీ. రాధాకృష్ణన్ ని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, చింతకాయల అయ్యన్న పాత్రుడు కుటుంబ సమేతంగా పాల్గొనడం విశేషం.
ప్రజా సేవలో నూతన బాధ్యతలు స్వీకరించిన ఈ ముగ్గురు సభ్యులు రాజ్యసభలో ప్రజల ఆకాంక్షలను సమర్థవంతంగా ప్రతిబింబిస్తూ దేశ అభివృద్ధికి విశేష సేవలందించాలని ఉపరాష్టపతి ఆకాంక్షను తెలియపరిచారు.

## డాక్టర్ కె.ఎస్. ప్రకాష్ రావు విగ్రహావిష్కరణ.

- కార్యక్రమం పాల్గొన్న ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్.







**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 25:** నగర ప్రజలకు ఆరు దశాబ్దాలకు పైగా విశిష్ట వైద్య సేవలు అందించి రూ.30 డాక్టర్ గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన కీర్తిశేషులు డాక్టర్ కె.ఎస్. ప్రకాష్ రావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే న్యూ కాలనీలో విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ ప్రకాష్ రావు తమ జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేసి, వేలాది మందికి ఆరోగ్యం అందించడమే కాకుండా జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. నిరుపేదలకు అందుబాటు వైద్య సేవలు అందించి సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్ రావు కుటుంబ సభ్యులు, మాజీ కార్పొరేటర్, ప్రముఖ క్రీడాకారిణి ఉషశ్రీ, స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం ద్వారకానగర్ మొదటి లైన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ కర్ల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ భరత్ తో కలిసి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ
ప్రారంభోత్సవం నిర్వహించి సంస్థ యాజమాన్యానికి వీరు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెడుతున్న యువ పారిశ్రామికవేత్తలను అభినందించిన ఎమ్మెల్యే, ఇలాంటి సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు నగర ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ధర్మవరం తాగునీటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సత్యకుమార్






- అమృత్ 2.0 కింద రూ.36.21 కోట్ల తాగునీటి పనులకు శంకుస్థాపన.
- రూ.36.21 కోట్ల అమృత్ తాగునీటి పనులకు భూమి పూజ చేసిన మంత్రి.
- ప్రజల ఆశీర్వాదంతో తెచ్చిన నిధులు ప్రజలకే అంకితం చేస్తున్నాం.
- రామ్‌నగర్, శాంతినగర్, గిరిరాజ్ కాలనీలలో ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం.
- నాలుగు రోజులకు కాదు...ప్రతిరోజూ మంచినీరు అందించడమే మా సంకల్పం.
- మాటలు కాదు... మౌలిక వసతులే మా రాజకీయానికి ప్రమాణం.
- ప్రజల సమస్య గుర్తించి పరిష్కారం చూపించడమే ప్రజా ప్రతినిధి బాధ్యత.
- నీటి సమస్యే కాదు... కరెంట్ సమస్యకూ శాశ్వత పరిష్కారం తీసుకొస్తున్నాం.

**ధర్మవరం, పెన్ సత్తా, జూన్ 25:** ధర్మవరం పట్టణం, రామ్‌నగర్‌లో ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి అమృత (అటల్ మిషన్ ఫర్ రేజువేనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ ) 2.0 పథకం క్రింద రూ.36.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి సరఫరా అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య శాఖ మంత్రి, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిందల్ సంస్థ ప్రతినిధి, మున్సిపల్ కమిషనర్, బీజేపీ పార్టీ నాయకులతో కలిసి మంత్రి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో తాగునీటి సమస్య దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ప్రస్తుతం నాలుగు రోజులకోసారి లేదా వారానికి ఒకసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని, దీనికి ప్రధాన కారణాలు పానుపల్లి ఇంటకే వద్ద నీటి పంపింగ్ లోపాలు, విద్యుత్ సమస్యలు అని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అమృత్ 2.0 పథకం కింద సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ధర్మవరం మున్సిపాలిటీని మూడు జోన్లుగా విభజించి, ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి రోజుకు 135 లీటర్ల సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.
ప్రాజెక్ట్‌లో భాగంగా..
1,పానుపల్లి ఇంటకే వెల్ వద్ద నిమిషానికి 17,460 లీటర్ల సామర్థ్యంతో 2 కొత్త పంపులు ఏర్పాటు చేయబడతాయి.
2, తమ్మాపురం రా వాటర్ సంప్ వద్ద నిమిషానికి 17,460 లీటర్ల సామర్థ్యంతో మరో 2 పంపులు ఏర్పాటు చేయబడతాయి. 3, ప్రస్తుతం ఉన్న 25 ఎంఎల్డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు అదనంగా 10 ఎంఎల్డి సామర్థ్యంతో కొత్త వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించబడుతుంది. 4, రామ్‌నగర్, శాంతినగర్, గిరిరాజ్ కాలనీలో ఒక్కొక్కటి 1000 కేఎల్ సామర్థ్యంతో 3 ఎలేవేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వ్వర్స్ నిర్మించబడతాయి. సుమారు 35.73 కిలో మీటర్ల పాత పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్ లైన్ వేయబడుతుందన్నారు. పాత పైపులు తుప్పు పట్టి చెడిపోయిన కారణంగా సురక్షిత మైన నీరు అందడం కష్టమైందని, కొత్త పైపుల ద్వారా నీటి నాణ్యత మెరుగుపడుతుందని చెప్పారు. అలాగే అమృత్ అంటే అటల్ మిషన్ ఫర్ రేజువేనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ అని, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి దూరదృష్టికి ప్రతీకగా ఈ పథకం రూపుదిద్దుకుందని వివరించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని మరింత విస్తరించి పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, మురుగునీటి నిర్వహణ, పార్కుల అభివృద్ధి వంటి కీలక సౌకర్యాల కోసం భారీగా నిధులు కేటాయించారని చెప్పారు. దేశవ్యాప్తంగా అమృత్ ఫేస్-1 లో దాదాపు 70,000 కోట్లు, ఫేస్-2లో సుమారు 75,000 కోట్లు మంజూరు చేయబడినట్లు తెలిపారు. గతంలో ధర్మవరం కోసం కూడా అమృత్ పథకం కింద 50 కోట్లకు పైగా నిధులు వచ్చినట్లు గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంత్రి ఒక ఆసక్తికర మైన విషయాన్ని పంచుకుంటూ, తాను గతంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఓఎస్డి గా పనిచేసిన సమయంలో అమృత్ పథకానికి సంబంధించిన నిధుల కేటాయింపుల్లో భాగమైనట్లు తెలిపారు. ఆ సమయంలో ధర్మవరానికి నిధుల మంజూరులో భాగస్వామిగా ఉండగా, ఇప్పుడు అదే ధర్మవరానికి ఎమ్మెల్యేగా మరో 36.21 కోట్ల ప్రాజెక్ట్ తీసుకురావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. తాగునీటి సమస్యలో విద్యుత్ సమస్యలు కూడా ప్రధాన కారణం కావడంతో ధర్మవరం పట్టణానికి భవిష్యత్తులో విద్యుత్ లోటు లేకుండా 110 కోట్లతో ప్రత్యేక డిపిఆర్ రూపొందించినట్లు తెలిపారు. ఆ ప్రణాళిక ఆమోద ప్రక్రియలో ఉందని, మొదటి విడతగా 4.60 కోట్లు ఇప్పటికే మంజూరై టెండర్లు కూడా పిలిచినట్లు వెల్లడించారు. ధర్మవరం పట్టణంలో పెరుగుతున్న జనాభా, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వలసలు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్, తాగునీటి మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పట్టణంలో 500 కు పైగా విద్యుత్ స్తంభాలను మార్చే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కాంట్రాక్టర్ సంస్థను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ఈ పనులకు అధికారిక గడువు 18 నెలలు ఉన్నప్పటికీ, ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని 12--15 నెలల్లోనే పనులు పూర్తి చేయాలని సూచించారు. పనుల అమలులో ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. చివరగా, ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రజలందరి భాగస్వామ్యంతో భారీ స్థాయిలో నిర్వహిద్దాం అని మంత్రి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈ.ఈ. సూర్యనారాయణ, డిటిహెచ్వో నరసింహుడు, జెడబ్ల్యుఐఎల్ ఇన్ఫ్రా లిమిటెడ్ ప్రతినిధి శ్రీనివాసులు,
మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, ఈ.ఈ. సాయి కృష్ణ, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేష్, పట్టణ అధ్యక్షులు జింక చంద్ర, కేత శ్రీనివాసులు, వాసు, డోలా రాజారెడ్డి, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, ఆ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీలో మరో సారి నిరుద్యోగులకు పండగ:

### విద్యుత్ శాఖలో భారీగా పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్.




**అమరావతి, జూన్ 25:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఎట్టకేలకు ఒక తీపి కబురు అందింది. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని పటిష్టం చేయడంతో పాటు, యువతకు ఉపాధి కల్పిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం రంగం లోకి దిగింది.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని ప్రభుత్వం విద్యుత్ శాఖలో ఏకంగా 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించింది. ఈ నిర్ణయం రాష్ట్రం లోని ఎంతో మంది ప్రతిభావంతు లైన యువ ఇంజనీర్ల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపనుంది. ఈ సంచలన నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్లను విద్యుత్ సంస్థలు అధికారికంగా విడుదల చేశాయి. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ విషయ మై మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న యువతకు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ ద్వారా పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ప్రభుత్వ సంస్థలను మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నిరుద్యోగుల కుటుంబాలలో ఆశల వెలుగులు, సంస్థల వారీగా ఖాళీల వివరాలు. చదువు పూర్తి చేసుకుని, తమ నైపుణ్యంతో రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని భావించే యువతీ యువకులకు ఇదొక అద్భుత మైన అవకాశం. ఈ భారీ నియామక ప్రక్రియలో భాగంగా ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కోలతో పాటు వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలలో (డిస్కమ్‌లు) ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొత్తం 629 పోస్టులలో ఏపీ ట్రాన్స్‌కోలో 200, ఏపీ జెన్‌కోలో 100, ఏపీఎస్పీడీసీఎల్‌లో 134, ఏపీసీపీడీసీఎల్‌లో 60, ఏపీఈపీడీసీఎల్‌లో 135 ఏఈఈ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి పట్టిక రూపంలో స్పష్టమైన వివరాలు ఇలా ఉన్నాయి. సంస్థ పేరు ఎలక్ట్రికల్ పోస్టులు సివిల్ పోస్టులు టెలికాం, ఇతర పోస్టులు మొత్తం పోస్టులు
ఏపీ ట్రాన్స్‌కో 167, 23, 10, 200.
ఏపీ జెన్‌కో 80 (మెకానికల్, ఎలక్ట్రానిక్స్ కలిపి) 20 -- 100. ఏపీఎస్పీడీసీఎల్ 125, 6, 4, 135. ఏపీసీపీడీసీఎల్ 56, 3, 1, 60. ఏపీఈపీడీసీఎల్ 128, 4, 3, 135. ఈ ప్రతిష్టాత్మక నియామకాల్లో విభిన్న విభాగాల ఇంజనీరింగ్ అభ్యర్థులకు ప్రాధాన్యత లభించింది. ఏపీ జెన్‌కోలో ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో కలిపి 80 పోస్టులను, సివిల్ విభాగంలో 20 పోస్టులను భర్తీ చేయనున్నారు. అదేవిధంగా, ఏపీ ట్రాన్స్‌కోలో 167 ఎలక్ట్రికల్, 23 సివిల్, 10 టెలికాం పోస్టులు ఉన్నాయి. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ ఖాళీల భర్తీ అభ్యర్థుల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపింది. సంవత్సరాల తరబడి ఈ క్షణం కోసం శ్రమిస్తున్న యువతకు ఈ ప్రకటన నిజంగా కొండంత అండగా నిలిచింది.
దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పిడిసిఎల్) పరిధిలో అభ్యర్థులు జూన్ 30 నుండి జూలై 27 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇక్కడ ఖాళీగా ఉన్న 125 ఎలక్ట్రికల్, 6 సివిల్, 4 టెలికాం పోస్టుల భర్తీ సజావుగా పూర్తి చేసేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. సమయం చాలా విలువైనది కాబట్టి అభ్యర్థులు వెంటనే తమ సన్నద్ధతను వేగవంతం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉన్నత స్థానంలో స్థిరపడాలని తపించే అభ్యర్థులు ఈ రిక్రూట్‌మెంట్‌ను తమ భవిష్యత్తుకు బలమైన పునాదిగా భావిస్తున్నారు.
రాష్ట్ర ఇంధన రంగ పునర్వైభవానికి యువత భాగస్వామ్యం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఏ రాష్ట్ర పురోగతిలోనైనా విద్యుత్ రంగానిదే అత్యంత కీలకమైన పాత్ర. నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించడం ద్వారానే పరిశ్రమలు విస్తరిస్తాయి, రైతులు సంతోషంగా ఉంటారు, సాధారణ ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి. అటువంటి మౌలిక వసతుల రంగంలో భాగస్వాములు కావడం అంటే సమాజానికి సేవ చేసే అపురూపమైన గౌరవం దక్కించుకోవడమే. ఈ నియామకాల ద్వారా రాష్ట్ర ఇంధన భద్రతకు ఒక సరికొత్త బలం లభిస్తుందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని నాయకత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి నడుం బిగించింది. గతంలో నియామకాలు లేక స్తంభించిపోయిన ప్రభుత్వ విభాగాలకు ఊపిరి పోయాలని నిర్ణయించింది. ఈ నియామకాలు విద్యుత్ సంస్థల సామర్థ్యాన్ని మరింతగా పెంచుతాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధీమా వ్యక్తం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కార్యాచరణను శరవేగంగా ప్రారంభించడం ద్వారా నిరుద్యోగులలో కోల్పోయిన నమ్మకాన్ని ప్రభుత్వం తిరిగి నిలబెట్టుకుంది.
మిగిలిన పంపిణీ సంస్థలలో సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఏపీసీపీడీసీఎల)లో 56 ఎలక్ట్రికల్, 3 సివిల్, 1 టెలికాం పోస్టుల భర్తీ జరగనుంది. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపిడిసిఎల్) పరిధిలో 128 ఎలక్ట్రికల్, 4 సివిల్, 3 టెలికాం పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ సిద్ధమైంది. అత్యంత పారదర్శక మైన విధానాలలో నియామకాలు పూర్తి చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. దీనితో ప్రతిభ కలిగిన ప్రతి యువకుడిలోనూ తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతుందనే బలమైన ఆకాంక్ష చిగురించింది. చాలా కాలంగా కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని, ఒక మంచి ఉద్యోగంతో తమ తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలని నిత్యం కలలుగనే కష్టజీవులకు ఈ నోటిఫికేషన్ వరం లాంటిది. కొన్నేళ్లుగా ఎడతెగని నిలకడతో, రాత్రింబవళ్లు లైబ్రరీలలో కష్టపడుతున్న మధ్యతరగతి విద్యార్థులకు ఇది కేవలం కొలువు కాదు, వారి ఆత్మగౌరవ ప్రయాణంలో లభించిన గొప్ప అవకాశం. ఈ ప్రకటన వెలువడటంతో నిరుద్యోగ శిబిరాల్లో, కోచింగ్ సెంటర్లలో నవ్యోత్సాహం వెల్లివిరిసింది. అవకాశాన్ని ఉపాధిగా మార్చుకోవలసిన సమయం ఇది.
రాష్ట్రం లోని అర్హులైన ప్రతి యువ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ ఈ నోటిఫికేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆకాంక్షించారు. మెరుగైన నైపుణ్యంతో విద్యుత్ శాఖను ముందుకు నడిపేందుకు యువ రక్తం ఎంతో అవసరం. ప్రభుత్వ పరిధి లోని ఈ ప్రతిష్టాత్మక సంస్థలలో ఉద్యోగం సంపాదించడం ద్వారా నిరుద్యోగుల జీవితాలు మారడమే కాకుండా, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి వారు గట్టి సారథులుగా నిలుస్తారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా పూర్తి పారదర్శక విధానంలో పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థులు ఈ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమయ్యే క్రమంలో ఆయా వెబ్‌సైట్లను సందర్శించి సిలబస్ పూర్తిగా అవగాహన చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పోటీ తీవ్రస్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికతో చదివిన వారికే విజయావకాశాలు మెండుగా ఉంటాయని నమ్ముతున్నారు. రోజుకో నిర్ణీత ప్రణాళికతో కష్టపడితే ఈ ఏఈఈ ఉద్యోగం సాధించి సమాజంలో ఉన్నత గౌరవం పొందడం అసాధ్యమేమీ కాదు.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అటు రాష్ట్ర విద్యుత్ మౌలిక రంగాన్ని పునర్నిర్మించడంలోనూ, ఇటు యువతకు మెరుగైన సంపాదన మార్గాన్ని చూపించడంలోనూ మైలురాయిగా నిలుస్తుంది. ఇది కేవలం ఒక విధానపరమైన ప్రక్రియే కాదు, వేలాది కుటుంబాల్లో భరోసాను నింపే చారిత్రాత్మక ముందడుగు. ప్రభుత్వం ఉద్యోగాల జాతరకు తెరలేపిన ఈ శుభతరుణంలో, యువత కూడా పట్టుదలను ఆయుధంగా చేసుకుని తమ కలల ఉద్యోగాన్ని చేజిక్కించుకోవాలని మంత్రి ఆశించారు.

# అక్కడ మోదీ.. ఇక్కడ చంద్రబాబు ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి.







- కూటమి రెండేళ్ల విజయోత్సవసభలో మంత్రి సత్య కుమార్, పరిటాల శ్రీరామ్.
- ప్రధాని మోది 12ఏళ్ల పాలన, కూటమి రెండేళ్ల పాలన పై విజయోత్సవ సభ.
- వైసిపి కరోనా వైరస్ లాంటిదంటూ మంత్రి సత్య కుమార్ కామెంట్.
- ధర్మవరం వైసీపీ నేతలు తొందరపడితే.. ఇప్పుడే ఇచ్చేస్తానంటూ వార్నింగ్.
- నాకు ధర్మవరంలో మొదట స్వాగతం పలికింది శ్రీరామ్ అన్నది మర్చిపోలేదు.
- కూటమి మరో 15 ఏళ్లు అధికారంలో ఉంటుందన్న శ్రీరామ్.
- వైసీపీ కుల రాజకీయాల పై నిప్పులు చెరిగిన చిలకం మధుసూదన్ రెడ్డి.

**ధర్మవరం, పెన్ సత్తా, జూన్ 25:**
కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉంటేనే, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ప్రధానమంత్రి మోదీ 12 ఏళ్ల పాలన, ఏపీలో కూటమి రెండేళ్ల పాలన విజయోత్సవం సభ ధర్మవరంలో ఘనంగా జరిగింది. పట్టణం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్, పరిటాల శ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి తో పాటు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 12 ఏళ్లలో సాధించిన విజయాలను వివరించారు. మోదీ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటున్నారన్నారు. దేశ సమగ్రత, సమైక్యత ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయట పడేసిన ఘనత ఒక్క ప్రధానమంత్రికే దక్కుతుందన్నారు. గతంలో ఆర్థిక ప్రగతి 19 శాతం ఉంటే నేడు 65 శాతానికి పెరిగిందని, ఇది తాము చెప్పడం లేదని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ నివేదికలు చెబుతున్నాయన్నారు. గతంలో ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు కూలిపోతుందో తెలిసే పరిస్థితి ఉండేదికాదన్నారు. కానీ నేడు ప్రపంచం లోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ముందుకు వెళ్తోందన్నారు. ప్రపంచంలో 4 వ స్థానంలో ఉన్న ఇండియా రానున్న రోజుల్లో మూడవ స్థానానికి చేరుతుందన్నారు. 12 సంవత్సరాల్లో ఎక్కడా ఉగ్రదాడులు లేవని ఒకటి రెండు చోట్ల జరిగినా దానికి అవతల దేశం లోకి మన సైన్యం వెళ్లి ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి జవాబు ఇచ్చింది అన్నారు. ప్రపంచ దేశాలకు ఒక గట్టి హెచ్చరికను కూడా ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో ఇచ్చామని గుర్తు చేశారు. అలాగే ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కూడా గణనీయ మైన ప్రగతి దిశగా పయనిస్తోందన్నారు. గతంలో కరోనా వైరస్ వచ్చినట్టుగానే 2019 లో రాష్ట్రానికి వైసీపీ వచ్చిందని, ఐదేళ్ల పాలనలో ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎమెర్జెన్సీ పాలన నడిపించిన పార్టీ నుంచి పిల్ల పార్టీగా వచ్చిన వైసీపీ హయాంలో రాష్ట్రం ఎంతో వెనుకబడిందన్నారు. కూటమి ప్రభుత్వ రాకతో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మహిళల, రైతుల ఆర్థిక ప్రగతి వస్తే, వైసిపి హయాంలో కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్ళు గుండెపోట్లు, బూతు పురాణాలు, దౌర్జన్యాలు, బీసీలను నడిరోడ్లో చంపడం, ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేయడం, భూ కబ్జాలు, పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని అరాచకాలు సృష్టించడం వంటివి వచ్చాయని అన్నారు. అందుకే ప్రజలు 151 మధ్యలో ఉన్న 5 ను తన్ని 11 స్థానాలకు పరిమితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఇప్పటికీ కుల రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఒక రౌడీషీటర్, 23 కేసులు ఉన్న వ్యక్తి కనిపించకుండా పోతే దాని పై కుల రాజకీయాలు చేస్తున్నారని, ఎవరైతే అత్యాచారాలు, హత్య కేసుల్లో నిందితులుగా ఉంటారో వారిని పరామర్శించేందుకు జగన్ వెళ్తున్నారంటే వారి పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. పైగా వైద్య ఆరోగ్యశాఖ సంబంధించి ఆరోగ్యశ్రీ ఎక్కడా అమలు కాలేదంటూ విమర్శలు చేస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో 9 వేల కోట్ల రూపాయలు ఆరోగ్యశ్రీ కోసం వెచ్చిస్తే.. రెండేళ్ల లోనే 7 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. సగటున ఏడాదికి 3,500 కోట్ల చొప్పున 17,500వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం ఉందన్నారు. గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో 41 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందితే ఈ రెండేళ్లలోనే 29 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందించామన్నారు. సగటున ఏడాదికి 14 లక్షల మందికి ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు ఎక్కడా అమలు కాలేదంటూ వచ్చిన విమర్శలకు.. లెక్కలతో సహా మంత్రి సత్య కుమార్ వివరించారు. ధర్మవరం నియోజకవర్గంలో 1,600 కోట్ల రూపాయలతో ఇప్పటికే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి రోడ్లు చూడని గ్రామాలకు కూడా రోడ్లు వేశామన్నారు. దేశంలో ఒకే ఒక చేనేత క్లస్టర్ వస్తే.. దానిని ధర్మవరానికి తీసుకొచ్చామన్నారు. ఆరోజు తాను ధర్మవరానికి వచ్చినప్పుడు మొట్ట మొదట ఆదరించింది, స్వాగతం పలికింది పరిటాల శ్రీరామ్ అని, దానిని ఎప్పటికీ మరువలేనన్నారు. ఆ తర్వాత మధుసూదన్ రెడ్డి కూడా కలిసి వచ్చి నా విజయానికి కారణమయ్యారన్నారు. ధర్మవరం ప్రజలు రుణం తీర్చుకునే విధంగా రాష్ట్రం లోనే అగ్రగామిగా ధర్మవరం నియోజకవర్గాన్ని నిలుపుతానని సత్యకుమార్ అన్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమం చేస్తుంటే కలుగులో దాకున్న కొందరు వైసిపి నాయకులు మళ్లీ బయటకు వచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. మధుసూదన్ రెడ్డికి నెక్స్ట్ బర్త్ ఉండదంటూ చేస్తున్న వ్యాఖ్యల మీద ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బుతో విహారయాత్రలు, విదేశాల్లో తిరుగుతున్నారని.. అలాంటి వారి గురించి పట్టించుకోవడంలేదని.. కానీ ఇలా బెదిరింపులకు దిగితే ఇప్పుడే వారికి ఇవ్వాల్సింది ఇచ్చేస్తామంటూ ఘాటుగా హెచ్చరించారు మూడేళ్లు ఆగుతారో ఇప్పుడే తీసుకుంటారో వారే నిర్ణయించుకోవాలని పరోక్షంగా వైసిపి నేతలకు వార్నింగ్ ఇచ్చారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ మరో 15 ఏళ్లు కూటమి అధికారంలో ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు పట్టాల మాదిరిగా సమ ప్రధాన్యతతో నడుస్తున్నాయని పరిటాల శ్రీరామ్ అన్నారు. గతంలో సంక్షేమం చేస్తున్నామన్న ముసుగులో కింది స్థాయి నుంచి పైదాకా అవినీతికి పాల్పడ్డారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు కూడా సంక్షేమ ఫలాలు అందిస్తూ మరో వైపు అభివృద్ధిని కూడా సమపాలెంలో తీసుకెళ్తోందని అన్నారు. కేవలం అభివృద్ధి సంక్షేమం కాకుండానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు కూడా తీసుకొస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఇప్పటికే పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతోందన్నారు. అన్ని ప్రాంతాలకు పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. ధర్మవరం పట్టణంలో 30 కోట్లతో చేనేత మెగా క్లస్టర్ తీసుకొచ్చారన్నారు. ఇది చేనేత వర్గాలు అందిపుచ్చు కోవాలన్నారు. టెక్నాలజీని జోడించి చేనేత క్లస్టర్లో అద్భుతాలు సాధించే విధంగా ముందుకు సాగాలన్నారు. మరో వైపు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ముఖ్యంగా మన ప్రాంతంలో కొన్ని చెరువులకు నీరు అందడం లేదని.. ఎర్రటి నెలలో మన రైతులు బంగారం పండిస్తారన్నారు. అందుకే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ధర్మవరం చెరువు ఆయకట్టుకు నెల రోజుల్లోనే నీరు ఇచ్చామన్నారు. గతంలో ధర్మవరం చెరువులో నీరు కేవలం బోటు షికార్లకు, రాత్రి అయితే మందేసి సేద తీరేందుకు అనే విధంగా చేశారన్నారు. ధర్మవరం చెరువుతో పాటు అన్ని ప్రాంతాల్లో చెరువులకు ఆయకట్టు స్థిరీకరణ చేస్తున్నట్లు చెప్పారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా ధర్మవరం ప్రాంతానికి అందాల్సిన నీరు పూర్తి స్థాయిలో అందటం లేదని.. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే పీఏబీఆర్ కుడికాలువను హంద్రీనీవా – ప్రధాన కాలువను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. రెండేళ్లలోపు ఈ ప్రాజెక్టు పూర్తైతే భవిష్యత్తులో ఎక్కడా సాగునీటి సమస్య ఉండదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్లుగా దేశాన్ని ప్రపంచం లోనే ఒక శక్తివంతంగా మారుస్తున్నారన్నారు. మరో 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని.. కచ్చితంగా ప్రజలు కూడా కూటమిని ఆదరిస్తారని అన్నారు.

కుల రాజకీయాలు మానుకోవాలి చిలకం మధుసూదన్ రెడ్డి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం జరుగుతుంటే వైసీపీ ఓర్వలేకపోతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత అభివృద్ధి ఎంతో వేగంగా జరుగుతోందన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు కుల రాజకీయాలు మొదలు పెట్టారన్నారు. ఎవరో కొందరు నేరస్తులకు కులాలు ఆపాదించి ఆ కులంలో మొత్తం అందర్నీ చెడుగా చిత్రీకరించడం, కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వచ్చిన తర్వాతనే లా అండ్ ఆర్డర్ రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. వైసిపి నాయకులు చేసే వాటికి భయపడేది లేదని.. వారు మళ్ళీ అధికారం లోకి వస్తామనేది కల అని మధుసూదన్ రెడ్డి అన్నారు. కచ్చితంగా మళ్లీ వచ్చేది కూటమి ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# రైతుల ఆదాయ వృద్ధి, పర్యావరణ పరి రక్షణే లక్ష్యం కొణతాల.

- నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో పండ్ల మొక్కల నాటడం ప్రారంభం.











**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 25:**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్), గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతుల పొలాల్లో ఒకేరోజు 30 వేల ఎకరాల్లో పండ్ల మొక్కల నాటకం కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గంలో గురువారం 50 లక్షల రూపాయలతో 50 ఎకరాలుకు పండ్లు మొక్కలు నాటు కార్యక్రమాన్ని అనకాపల్లి మండలం, పాపయ్యపాలెం గ్రామం నందు మాజీ మంత్రి, శాసనసభ్యులకు కొణతాల రామకృష్ణ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చరిత్ర లోనే ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టిన ఈ ఉద్యమం ద్వారా రైతులకు స్థిరమైన జీవనోపాధి కల్పించడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.
ఈ పథకం కింద మామిడి, జీడిమామిడి, బత్తాయి, నిమ్మ, జామ, కొబ్బరి, సపోటా, దానిమ్మ, సీతాఫలం, నేరేడు, చింత, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక ఆదాయం అందించే పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ఆర్థికాభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి, పర్యావరణ పరి రక్షణ లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరంలో సుమారు లక్ష ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతుల భూముల్లో పండ్ల తోటల అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. పండ్ల తోటల ఏర్పాటుకు అవసర మైన గుంతల తవ్వకం, మొక్కల కొనుగోలు, నాటడం, ఎరువుల వినియోగం, సంరక్షణ, నీటి పారుదల వంటి అన్ని కార్యకలాపాలకు ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. తోటల నిర్వహణ కోసం రెండు నుంచి మూడు సంవత్సరాల పాటు ఎకరాకు రూ. 1 లక్ష నుంచి రూ. 2.5 లక్షల వరకు ఆర్థిక మద్దతు లభిస్తుందని వివరించారు.
గత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల అభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. పండ్ల మొక్కల నాటడం మంచి ప్రారంభమేనని, వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షించి అభివృద్ధి చేస్తే భవిష్యత్తులో రైతు కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరులుగా మారతాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రతి రైతు తన భూమిని పచ్చని సంపదగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగం, గ్రామస్థాయి సిబ్బంది, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవన శాఖ అధికారులను అభినందించారు.
మొక్క నాటుదాం -- ప్రకృతిని కాపాడుదాం -- రైతును అభివృద్ధి పరచుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


# రాజ్యాంగ హత్య దినం సందర్భంగా నిరసన




**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 26:**భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఘనంగా "సంవిధాన్ హత్య దివస్" సందర్భంగా నిరసన సభ. భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో, 1975 జూన్ 25 వ తేదీన దేశంలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా విధించిన ఎమర్జెన్సీని నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎం.ఎం.ఎన్. పరశురామరాజు అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో "సంవిధాన్ (రాజ్యాంగ హత్య దినం) కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారత ప్రధానిగా ఉన్న సమయంలో అలహాబాద్ హైకోర్టు ఆమెకు వ్యతిరేకంగా తీర్పునిచ్చిందని, ఆ క్రమంలో ఆమె ప్రధాని పదవి నుండి తప్పుకోవాల్సి రాగా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలో అత్యవసర పరిస్థితిని (ఎమర్జెన్సీ) విధించారని గుర్తు చేశారు. ఆ నల్లటి రోజుల్లో విపక్ష రాజకీయ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయించారని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ మీడియా ప్రతినిధులను నిర్బంధించడమే కాకుండా పత్రికా కార్యాలయాలకు విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండి పడ్డారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా గళమెత్తిన వారిని అక్రమంగా జైళ్లలో బంధించి వేధించారని ఆయన తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం ఎన్నో పోరాటాలు చేసిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలతో కూల్చివేసినప్పుడు, వారికి మొదటిగా అండగా నిలిచి, సంఘీభావం ప్రకటించింది నాటి బిజెపి (జనసంఘ్ నేతలు) అని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కే. సురేంద్రమోహన్, రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవ్ కాంత్, సంవిధాన్ హత్య దివస్ రాష్ట్ర కన్వీనర్ కే.ఎన్.పి. చక్రవర్తి, జిల్లా కన్వీనర్ పొలిమేర శ్రీనివాస్ లతో పాటు రాష్ట్ర, జిల్లా పదాధికారులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి



జిల్లా కలెక్టర్ విజయ క్రిష్నన్.

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 25:** జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీసి హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పలు కీలక అంశాల పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు అందుతున్న ప్రజా వినతులను సంబంధిత మండలాలకు వెంటనే పంపించి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆరు నెలలుగా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసినప్పటికీ కొందరికి అందలేదని అర్జీలు వస్తున్నాయని తక్షణమే మిగిలిన వాటిని పంపిణీ చేయుటకు శ్రీకారం చుట్టాల ఎమ్మార్వోలకి, వీఆర్వోలకి ఆదేశించారు. గ్రౌండ్ సర్వే లో ఎంత భూమి సాగు చేస్తున్నారు ఎంతమంది ఉన్నారు వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు సరిపోయాయా లేవా ఈ- కే వై సి ద్వారా ఆధార్ నెంబరు, డాక్యుమెంట్ నెంబర్ చెక్ చేసుకొని పట్టాదారి పాస్ పుస్తకాలు జారీ చేయలన్నారు. అనంతరం

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ

ఈ-కేవైసీ, మన మిత్ర, క్రాప్ బుకింగ్, ఓడీఎఫ్ గ్రామాలు, డీఆర్‌డీఏ కార్యక్రమాలు, స్వచ్ఛాంధ్ర తదితర ప్రభుత్వ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, నిర్ణీత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు, పీఎం సూర్య ఘర్ యోజనలో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ఓడీఎఫ్ హోదాను కొనసాగించేలా చర్యలు చేపట్టాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఇన్‌చార్జి డీఆర్ఓ వై. శ్రీనివాస్‌తో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మత్తు రహిత సమాజ స్థాపనే మన లక్ష్యం.

- **అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా.**
- **జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ వారోత్సవాలు.**
- **పరవాడ సబ్ డివిజన్ పరిధిలో పకడ్బందీ నిఘా ఇంచార్జ్ డీఎస్పీ.**
- **యలమంచిలి భాష్యం స్కూల్ వేదికగా విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన జిల్లా ఎస్పీ.**

**అనకాపల్లి (యలమంచిలి), పెన్ సత్తా, జూన్ 25:** నవభారత నిర్మాణంలో భాగంగా మత్తు పదార్థాల రహిత సమాజాన్ని స్థాపించడమే మన అందరి ప్రథమ కర్తవ్యమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం ఽ సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" లో భాగంగా జూన్ 17 నుండి జూన్ 26 వరకు 10 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వారోత్సవాలు (నషా ముక్త్ భారత్ సప్తాహ్) అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ వారోత్సవాలలో భాగంగా నేడు యలమంచిలి పట్టణం లోని గాంధీనగర్ లో గల భాష్యం స్కూల్ వద్ద జరిగిన విస్తృత అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ

?"జూన్ 26 న రానున్న 'అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవగాహన కార్యక్రమాలను జిల్లా లోని అన్ని ప్రాంతాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నాం. విద్యార్థులు, యువత తమ ఉజ్వలమైన భవిష్యత్తును పాడుచేసే అలవాట్లకు దూరంగా ఉండాలి. జిల్లా వ్యాప్తంగా మాస్ ప్లెడ్జ్ డ్రైవ్‌లు, అవగాహన ర్యాలీలు, వీధి నాటకాలు మరియు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజల్లో చైతన్యం తెస్తున్నాం. ప్రతి పౌరుడూ ఒక 'నషా ముక్తి మిత్ర గా మారాలి అన్నారు.

క్షేత్రస్థాయిలో కఠిన నిఘా -- పరవాడ సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ బి.మోహన రావు మాట్లాడుతూ, మత్తు పదార్థాల నిర్మూలనకు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను వివరించారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం పరవాడ సబ్ డివిజన్ పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయాల పై అత్యంత కఠిన మైన నిఘా ఏర్పాటు చేశాం. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో, యువత ఎక్కువగా గుమిగూడే ప్రదేశాలలో ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి సైతం వెనుకాడం. కేవలం చట్టపర మైన చర్యలకే పరిమితం కాకుండా, రూట్ లెవెల్‌లో మార్పు కోసం రూరల్ ప్రాంతాల్లో, పంచాయతీలు, మహిళా సంరక్షణ కార్యకర్తలతో కలిసి విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రజలకు, విద్యార్థులకు ఎక్కడైనా మత్తు పదార్థాల అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయి.







సమసమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ.

?అనంతరం యలమంచిలి సిఐ ధనుంజయ రావు విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, దేశ నిర్మాణంలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ అవగాహన కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్ ఇంచార్జ్ డీఎస్పీ బి.మోహనరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, యలమంచిలి సీఐ ధనుంజయ రావు, ఎన్.డి.పి.ఎస్ సిఐ పిల్లా రమేష్, ఎస్సైలు సావిత్రి, ఉపేంద్ర, రామకృష్ణారావు, ప్రసాదరావు మరియు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, ఐసిడిఎస్ సిబ్బంది, భాష్యం పాఠశాల యాజమాన్యం మరియు పెద్ద సంఖ్యలో వివిధ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్ల పై, కాలువల్లో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు.






- **హోటల్స్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలి.**
- **జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 25: నగరంలో పారిశుధ్య నిర్వహణకు ఆటంకం కలిగించే విధంగా హోటల్స్, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్ వద్ద వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయడం, రోడ్ల పై లేదా కాలువల్లో పడేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ సౌత్ జోన్ పరిధి లోని 29 వ వార్డు జగదాంబ జంక్షన్ ప్రాంతంలో ఉన్న మసీదు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల పై ఉన్న వ్యర్థాల తొలగింపు, కాలువల శుభ్రత, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా హోటల్స్, టిఫిన్ సెంటర్లు, టీ స్టాల్స్ నిర్వాహకులు తమ వ్యాపార ప్రదేశాల్లో వ్యర్థాలను ఆరుబయట పడవేస్తున్నారని, తప్పనిసరిగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకుని జీవీఎంసీ వాహనాలకు వ్యర్థాలను నిత్యం అందించాలని సూచించారు. వ్యర్థాలను రోడ్ల పై, కాలువలలో, బహిరంగ ప్రదేశాలలో వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా, వర్షాకాలంలో కాలువలు పొంగిపొర్లి ప్రజల ఆరోగ్యం పై ప్రభావం చూపుతుందన్నారు. మసీదు సమీప ప్రాంతంలో ఉన్న కొన్ని హోటల్స్, టిఫిన్ సెంటర్లు, టీ టైమ్స్ దుకాణాల వద్ద వ్యర్థాలు అస్తవ్యస్తంగా ఉండడాన్ని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను గమనించిన కమిషనర్ సంబంధిత నిర్వాహకులను హెచ్చరించారు. రోడ్ల పై చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సచివాలయం వార్డు శానిటరీ కార్యదర్శిని ఆదేశించారు. అదే ప్రాంతంలోని "మా ఊరి వంట" హోటల్ వద్ద వ్యర్థాలు బహిరంగంగా రోడ్డుపై ఉండడాన్ని గమనించి నిబంధనలు ఉల్లంఘించినందుకు హోటల్ పై చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా వసూలు చేయాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ కు కమిషనర్ ఆదేశించారు. అలాగే మరో టిఫిన్ సెంటర్ వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేసినప్పటికీ టిఫిన్ వ్యర్థాలు కాలువలో పడేయడాన్ని గుర్తించి నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించారు. ఇకపై రోడ్ల పై కానీ, కాలువల్లో కానీ వ్యర్థాలు కనిపిస్తే సంబంధిత దుకాణాలు, హోటల్స్ పై జరిమానాలను విధిస్తూ తగు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వ్యాపార సంస్థలను,దుకాణాలను సీజ్ చేసే చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ను కమిషనర్ ఆదేశించారు.

ప్రతిరోజు వ్యర్థాల సేకరణ ,తరలింపు ప్రక్రియ జరుగుచున్నదా , వాహనాలు వస్తున్నాయా లేదా అనే విషయాన్ని స్థానికులను కమిషనర్ ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఉదయం 5.30 గంటలకు విధులకు హాజరై తమ పరిధిలోని ప్రాంతాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని, అధికారులు కూడా నిర్ణీత సమయానికి విధుల్లో హాజరై పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు, వ్యాపార సంస్థలు జీవీఎంసీకి సహకరించాలని కమిషనర్ తెలిపారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ తో పాటు సచివాలయ సానిటరీ, అమినిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ను వాహనదారులు వినియోగించుకోవాలి.

- **రోడ్ల పై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు.**
- **జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**





**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 25:** విశాఖ నగర పరిధిలో రోడ్ల పై వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసి ప్రజలకు, వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్ నియంత్రణకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపర మైన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ సౌత్ జోన్ పరిధి లోని 29 వ వార్డు జగదాంబ జంక్షన్ వద్ద ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌సీపీ)ను పరిశీలించారు. పార్కింగ్ నిర్వహణ, వాహనాల రాకపోకలు, వినియోగదారుల వివరాలను సంబంధిత కార్ పార్కింగ్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వాహనాల రద్దీని తగ్గించడం, ప్రజలకు సౌకర్యవంత మైన పార్కింగ్ సదుపాయం కల్పించడం లక్ష్యంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ద్వారా నిధులు వెచ్చించి అధునాతన సదుపాయాలతో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు, వ్యాపార సంస్థలు తమ వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేయకుండా అందుబాటులో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రోడ్ల పై అస్తవ్యస్తమైన పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటమే కాకుండా పాదచారులు, రాకపోకలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలుగుతుందని అన్నారు. ఇక పై సీసీ కెమెరాల ద్వారా రోడ్ల పై అక్రమంగా, అసౌకర్యంగా పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి సంబంధిత వారికి జరిమానాలు విధిస్తూ తగిన చర్యలు పోలీసువారి సహకారంతో తీసుకోవడం జరుగుతుందన్నారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌లో ప్రతిరోజు ఎన్ని వాహనాలు పార్కింగ్ అవుతున్నాయి, ఏ ప్రాంతాల నుంచి వాహనదారులు వినియోగిస్తున్నారనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్సిపి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాతో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన వాహనాలను గమనించి, ఎం ఎల్ సి పి సదుపాయాన్ని వినియోగించేలా వాహనదారులకు సూచిస్తూ అవగాహన కల్పించాలని నిర్వాహకులకు కమిషనర్ ఆదేశించారు.

ఈ విషయ మై, విశాఖ పోలీస్ కమిషనర్‌తో నేరుగా ఫోన్లో మాట్లాడి మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ప్రజలు వినియోగించుకునేందుకు రోడ్ల పై అస్తవ్యస్తంగా పార్కింగ్ పార్కింగ్ చేసిన వాహనాలకు ట్రాఫిక్ పోలీస్ ద్వారా నియంత్రణ చర్యలు తీసుకొని ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరినట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం సమీప ప్రాంతాల్లోని ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతూ రోడ్ల పై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, రోడ్లపై అస్తవ్యస్తంగా పార్కింగ్‌లను గమనించినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని కమిషనర్ స్థానికులకు సూచించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్వాహకులు, వార్డ్ ఎమ్యూనిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు మొహర్రం శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్.



**పుట్టపర్తి, పెన్ సత్తా, జూన్ 25:** త్యాగానికి, కరుణకు ప్రతీక అయిన మొహర్రం పండుగను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లా ముస్లిం సోదరులందరికీ జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొహర్రం పండుగ సమాజంలో శాంతి, కరుణ, త్యాగ నిరతిని చాటిచెబుతుందని పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఈ దినాన్ని జరుపుకుంటారని తెలిపారు. జిల్లా లోని ప్రజలందరూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ, ఈ పండుగను శాంతియుత వాతావరణంలో, సాంప్రదాయబద్ధంగా జరుపు కోవాలని ఆయన ఆకాంక్షించారు.

# రెసిడెన్షియల్ హాస్టల్స్ లో లక్ష మొక్కలు నాటే కార్యక్రమం కలెక్టర్ విజయ క్రిష్ణన్

నాటిన ప్రతి మొక్కా బతకాల్సిందే కలెక్టర్.






**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 25:** నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమం కింద రెసిడెన్షియల్ హాస్టల్స్ లో లక్ష మొక్కలు నాటే (ప్లాంటేషన్) కార్యక్రమాన్ని శత శాతం పూర్తి చేయాలని, నాటిన ప్రతి మొక్కను వంద శాతం కాపాడు కోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ విసి హాల్ నుండి జిల్లా అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమం కింద రెసిడెన్షియల్ హాస్టల్స్ ఆవరణలో చేపట్టే ప్లాంటేషన్ కార్యక్రమంలో మొత్తం 1,00,000 (లక్ష) మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, హాస్టల్ స్థల పరిమాణాన్ని బట్టి సుమారు 1,625 నుండి 6,500 వరకు మొక్కలు నాటాలని, ఈ ప్రక్రియ శనివారం ముగియాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు పెండింగ్‌లో ఉండకూడదని తేల్చి చెప్పారు. ఈ ప్లాంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఎస్ఎంసి సభ్యులందరినీ భాగస్వామ్యం చేసి, ఉదయం 6-00 గంటల నుంచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి ఉదయం 10-00 గంటల లోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మొక్కల సంరక్షణ - హెచ్ఓడీల బాధ్యత.

ప్లాంటేషన్ ప్రక్రియలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహా అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని, అయితే, మొక్కలు నాటిన తర్వాత వాటిని కాపాడి, బతికించాల్సిన పూర్తి బాధ్యత ఆయా శాఖల హెచ్ఓడీలదేనని తెలిపారు. క్యాంపస్ చుట్టూ కాంపౌండ్ వాల్ ఉంటుంది కాబట్టి, బయటి నుండి ఎలాంటి అంతరాయాలు ఉండవని, కాబట్టి మొక్కలు చనిపోవడానికి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. నాటిన మొక్కల్లో ఏవైనా చనిపోతే, ఆలస్యం చేయకుండా వెంటనే కొత్త మొక్కలను నాటాలని, దీని కోసం మళ్లీ పీడీ డ్వామానో, సోషల్ ఫారెస్ట్రీ శాఖనో మొక్కలు ఇస్తారని ఎదురు చూడకూడదని చెప్పారు. ఈ ప్లాంటేషన్ ప్రాజెక్టులో మన జిల్లా, ఇతర జిల్లాలకు రోల్ మోడల్‌గా నిలవాలని స్పష్టం చేశారు. ప్లాంటేషన్ ప్రగతి పై ఇక పై ప్రతి వారం సమీక్షా నివేదికలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. రాబోయే ఒక సంవత్సరం పాటు ఈ కార్యక్రమం పై నిరంతర పర్యవేక్షణ మరియు అధికారుల పై పూర్తి బాధ్యత ఉంటుందని తేల్చి చెప్పారు. వచ్చే ఏడాది ఇదే సమయానికి సమీక్ష నిర్వహించే నాటికి, నాటిన ప్రతి మొక్కా పెరిగి పచ్చదనంతో కళకళలాడాలని చెప్పారు.

# సర్ కార్యక్రమంలో కూటమి శ్రేణులు భాగస్వాములు కావాలి యార్లగడ్డ.



**గన్నవరం, పెన్ సత్తా, జూన్ 25:** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గం లోని కూటమి నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పిలుపు నిచ్చారు. వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా వెళ్లిన యార్లగడ్డ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేసారు. గన్నవరం నియోజకవర్గంలో 'సర్' కార్యక్రమం విజయవంతం చేసేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలు అందేలా చూడటంతోపాటు, ఓటర్లు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను బిఎల్ఓలకు అందించే వరకు ఫాలోఅప్ చేయాలన్నారు. ఎన్యూమరేషన్ అధికారులు, బిఎల్ఓలతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ వారి సూచనలను పాటిస్తూ అర్హుల ఓట్లు తొలగించకుండా తగు జాగ్రత్త వహించటంతోపాటు మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు తొలగించేలా చూడాలని కూటమి శ్రేణులను యార్లగడ్డ కోరారు. 18 ఏళ్ళు నిండిన వారిని ఓటరుగా చేర్పించాలని, నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన క్యాషియర్ శశిని సన్మానించిన ఎస్పీ.



- రూ.45 లక్షల విలువైన బంగారు ఆభరణాల అప్పగింత.
- రూ.45 లక్షల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను యజమానికి అప్పగించిన హోటల్ క్యాషియర్.
- డయల్-112 సమాచారంతో వెంటనే స్పందించి బ్యాగ్‌ను గుర్తించిన పోలీసులు.
- సమాజానికి ఆదర్శంగా నిలిచే విలువలున్న వ్యకి శశి, కొనియాడిన జిల్లా పోలీస్ శాఖ.

**తిరుపతి, పెన్ సత్తా, జూన్ 25:** తిరుమలలో కుటుంబ వివాహ కార్యక్రమం ముగించుకుని బెంగళూరుకు తిరుగు ప్రయాణం అవుతున్న ఓ కుటుంబం మార్గమధ్యలో అలిపిరి సమీపం లోని గరుడాద్రి హోటల్‌లో భోజనం చేసిన అనంతరం, సుమారు రూ.45 లక్షల విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను అక్కడే మరిచిపోయి వెళ్లిపోయారు. బెంగళూరుకు చేరుకున్న తర్వాత బ్యాగ్ కనిపించకపోవడంతో బాధితుడు శ్రీ భరత్ కుమార్ డయల్-112 కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు స్పందించి హోటల్ వద్ద విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గరుడాద్రి హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న శశి, కస్టమర్లు మరిచిపోయిన బ్యాగ్ ను గమనించి అందులో విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయని తెలుసుకుని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా అత్యంత భద్రంగా దాచిపెట్టి సంరక్షించినట్లు గుర్తించారు. పోలీసుల సమక్షంలో బ్యాగ్‌ను తెరిచి పరిశీలించగా అందులో ఉన్న సుమారు 300 గ్రాముల బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం ఆ బ్యాగ్‌ను బాధితుడు శ్రీ భరత్ కుమార్, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు భరత్ కుమార్ మాట్లాడుతూ తమ కుటుంబంలో జరిగిన వివాహానికి సంబంధించిన విలువైన బంగారు ఆభరణాలన్నీ ఆ బ్యాగ్ లోనే ఉన్నాయని, బ్యాగ్ తిరిగి దొరకకపోతే కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని తెలిపారు. హోటల్ క్యాషియర్ శశి చూపిన నిజాయితీతో పాటు, డయల్-112కు సమాచారం అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకున్న పోలీసుల సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఈ ఘటన పై స్పందించిన తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు "నిజాయితీ అనేది మనిషి సంపాదించగలిగే అత్యంత విలువైన ఆస్తి అన్నారు. లక్షల రూపాయల విలువైన ఆభరణాలు దొరికినా వాటిని యథావిధిగా యజమానికి అప్పగించడం గొప్ప మానవీయ విలువలకు నిదర్శనం. శశి చూపిన బాధ్యత, నిబద్ధత, నిజాయితీ సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఇటువంటి వ్యక్తుల వల్లనే సమాజంలో నైతిక విలువలు మరింత బలపడతాయి. అలాగే ప్రజలకు సేవ చేయడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పని చేస్తుంది" అని పేర్కొన్నారు.

అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయంలో శశిని సాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఆమె నిజాయితీని కొనియాడుతూ ప్రశంసించారు, సమాజంలో మానవీయ విలువలు, నిజాయితీ, బాధ్యతాయుత మైన ప్రవర్తనకు ఈ ఘటన ఒక ఉత్తమ ఉదాహరణగా నిలిచిందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ శ్రీనివాసులు (పరిపాలన) చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, సిఐ మద్దయ్యాచారి పాల్గొన్నారు.

# "పైడిగాం" ప్రాజెక్ట్ కి పోదాం,పదండి!



వైసీపీ సమన్వయకర్త సాడి.శ్యాం ప్రసాద్ రెడ్డి

**ఇచ్ఛాపురం పెన్ సత్తా, జూన్ 25**:ఒకప్పుడు మూడు మండలాలలోని వేలాది ఎకరాల పంట పొలాలకు నీరందించిన ప్రాజెక్ట్ ఇప్పుడు పూర్తి స్థాయిలో రైతులకు నీరు అందించే పరిస్థితిలో ఉందా? కెనాల్ సిమెంట్ లైనింగ్ పనులు అసంపూర్తిగా ఆగిపోయి ఏళ్ళు గడుస్తున్న తదుపరి పనులు మరలా ఎప్పుడు ప్రారంభించి పూర్తి చేస్తారు? పైడిగాం ప్రాజెక్ట్ కు ఎగువన ఒడిస్సా ప్రాంతంలో గంజాంజిల్లా,తుంబ దగ్గర పురియాసహి వద్ద నిర్మించిన (నిర్మిస్తున్న) ప్రాజెక్ట్ వలన దిగువన గల మనకు న్యాయంగా రావాల్సిన నీరు సరఫరా జరిగే అవకాశం ఉందా? ఒడిస్సా ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్ట్ గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఉందా, లేదా? ఉంటే ఎటువంటి చర్యలు తీసుకున్నారు? ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన 15 లక్షలు రూపాయలలో 18-20% టాక్స్ లు పోతే మిగిలిన సొమ్ముతో ఎంత వరకు పనులు జరుగుతాయి, అరకొర నిధులతో ప్రయోజనం ఉంటుందా? వరదలు వస్తేనే పైడిగాం కు మరియు దిగువన గల గ్రోయిన్ లకు వాటర్ వస్తుంది కానీ సాధారణ పరిస్థితులలో ఎగువన గల ఒడిస్సా నుండి మనకు నాయ్యంగా రావలసిన నీటి వాటా సరఫరా కొరకు స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదు!

పైడిగాం ప్రధాన కాలువ మరియు కాలువకు అనుసంధానంగా ఉన్న సుమారు 60 చెరువులకు నీరుపారే స్థితిలో కాలువలు ఉన్నాయా? పైడిగాం ప్రాజెక్ట్ తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఎకరాలకు నీరు అందించగలిగే సామర్థ్యం గలది,అటువంటి ప్రాజెక్ట్ పనులపై అలసత్వం ఎందుకు? తిత్లి తుపాన్ కు పాడైనా పైడిగాం రిపేర్ పనులు పూర్తి స్థాయిలో జరుగకపోవటం వలన ఇంకో పెద్ద తుపాన్ (వరద) వస్తే ప్రాజెక్ట్ పూర్తిగా పాడయ్యే పరిస్థితి వరకు వేచిఉందామా?

పైన పేర్కొన్న అంశాలు వాటి వాస్తవ పరిస్థితి తెలుసుకుని రైతులకు, ప్రజలకు తద్వారా ప్రభుత్వానికి తెలియజేసే ప్రయత్నంలో భాగంగా,

ఈ నెల తేది 28-6-26(ఆదివారం )ఉదయం 8 గంటలకు బేసి రామచంద్రపురం నుంచి కార్యకర్తలు మరియు రైతులతో కలసి పైడిగాం ప్రాజెక్ట్ వద్దకు చేరుకుని వాస్తవ పరిస్థితులు మీడియా ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసే కార్యక్రమం ఉంటుందని నియోజకవర్గ సమన్వయకర్త సాడి.శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# గ్రామాభివృద్ధికి పెద్ద పీట ...కొత్త సీసీ రోడ్ల ప్రారంభోత్సవం.

**కె.కోటపాడు, పెన్ సత్తా, జూన్ 25**:మండలంలోని గొట్లం గ్రామంలో 22 లక్షల రూపాయలతో సిసి రోడ్లను, కె.సంతపాలెంలో రూ.29 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను మాడుగుల ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పి.వి.జి.కుమార్ తో కలిసి గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన బండారుకు, పి వి జి కుమార్ కు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ చిన్న, చుక్క రమణ తదితరులు స్వాగతం పలికారు. ఈ ప్రారంభోత్సవం రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, ఎంపీడీఓ సాంబశివరావు, మండల ఇంజనీరు సుమతి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కన్నూరు సూర్యనారాయణ, జడ్పిటిసి మాజీ సభ్యులు కశిరెడ్డి అప్పలనాయుడు, పి సత్యవతి, నాయకులు చల్లా తులసి, కొల్లి వెంకటరమణ, రెడ్డి ప్రభాకర్, క్లస్టర్ ఇంచార్జిలు కొట్యాడ నారాయణ మూర్తి, వెలగల పైడంనాయుడు, నాయకులు సబ్బవరపు రామునాయుడు,పూడి నారాయణ మూర్తి, రుద్ర ఈశ్వర్ రావు, కంచిపాడు శ్రీను, చీపురుపల్లి రామారావు, బోలెం బుల్లి దొర, బండారు దేముడుబాబు, వి.ఎస్.నాయుడు,పూడి శ్రీను, పైలా గోపి, లెక్కల రాముడు, లెక్కల నాయుడు, కొట్టాడ నాగరాజు,కొట్టాన ఈశ్వరరావు(బీజేపీ),చుక్క నారాయణ మూర్తి(జనసేన), కొట్టాన రాము, సబ్బవరపు కన్నంనాయుడు, వాసుదేవ నాయుడు, బండారు దొరబాబు, మతల కన్నంనాయుడు, కొట్యాడ నాగరాజు, లెక్కల



అచ్చిబాబు, కామిరెడ్డి నాయుడు, శీరంరెడ్డి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గురువులే మార్గదర్శకులు వాళ్లను గౌరవిస్తే ఉన్నత శిఖరాలకు వెళ్తాం.



ఇంటర్మీడియట్ రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ కర్రి.అనిత.

**కవిటి పెన్ సత్తా, జూన్ 25**: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ఫలితాలలో కవిటి పట్టణానికి చెందిన కళ్యాణి కాలేజ్ విద్యార్థిని కర్రి.అనిత 470/468 కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించినందుకు కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో కరస్పాండెంట్ లోళ్ళ.రాజేష్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో చిరు సత్కారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లోళ్ళ.రాజేష్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో పుట్టి వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన కర్రి.అనిత నామమాత్రపు వసతులతో చదివి నేడు రాష్ట్ర ప్రథమ ర్యాంకర్ గా నిలిచినందుకు ప్రతి ఒక్క విద్యార్థికి ఆమె కృషి పట్టుదల స్ఫూర్తిదాయకం కావాలని,అనిత చదివే విధానం ఆమె నడవడిక ఉపాధ్యాయులపై ఉన్న భక్తి, గౌరవం వలన ఈ విజయం సాధ్యపడిందని ఆయన పేర్కొన్నారు.అనితను ప్రతి ఒక్క విద్యార్థి ఆదర్శంగా తీసుకొని మీరు కూడా ఇంకా ఉన్నత శిఖరాలకు వెళ్లాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఉద్దేశించి అనిత మాట్లాడుతూ మొదటి రోజు నుంచి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదవాలని,గురువులను గౌరవించాలని వాళ్లే మన జీవితానికి మార్గదర్శకులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందు మాధవి ఏవో రాణ, డైరెక్టర్ రమేష్ తో పాటు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరల్డ్‌కప్ ఎఫెక్ట్..
# భారత్, ఐర్లాండ్ టీ20 సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు..!

భారత్, ఐర్లాండ్ పొట్టి సిరీస్ షెడ్యూల్ మారింది. ఇది వరకు ప్రకటించిన సమయానికంటే గంట ముందే మ్యాచ్‌లు జరుగనున్నాయి. మహిళల టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌ల నేపథ్యంలో ఐర్లాండ్ క్రికెట్ ఈ నిర్ణయం తీసుకుంది. భారత్, తమ జట్టు మధ్య జరుగనున్న రెండు టీ20ల సమయాన్ని మార్చినట్టు బుధవారం రాత్రి ఆ దేశ బోర్డు వెల్లడించింది. ఐర్లాండ్ పర్యటనలో శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత పురుషుల జట్టు రెండు టీ20ల సిరీస్ ఆడనుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. జూన్ 26న తొలి టీ20.. ఆపై ప్రపంచకప్‌లో సెమీస్ బెర్తుపై కన్నేసిన టీమిండియా జూన్ 28న ఆస్ట్రేలియాను ఢీ కొట్టనుంది. ఉంది. లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు జరుగనుంది. దాంతో, రెండూ ఒకేసారి మొదలవ్వకూడదనే ఉద్దేశంతో.. ఆరోజు భారత్, ఐర్లాండ్ గేమ్‌ను గంట ముందు అంటే.. సాయంత్రం 6 గంటలకు నిర్వహించేందుకు ఐర్లాండ్ క్రికెట్, బీసీసీఐ అంగీకరించాయి. టీమిండియా మ్యాచ్‌లను ప్రసారం చేసే సోనీ స్పోర్ట్స్ సైతం షెడ్యూల్ మార్పునకు ఆమోదం తెలిపింది. అలానే.. ఇంగ్లండ్ పర్యటనలోనూ భారత జట్టు ఐదు టీ20ల సిరీస్‌లో మ్యాచ్‌ల సమయం కూడా తేడాగా ఉంది. రెండు, నాలుగో టీ20లు రాత్రి 7గంటలకు జరుగనుండగా.. మిగతా మూడు(ఒకటో, మూడో, ఐదో టీ20లు) మ్యాచ్‌లను రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఇక ఆగస్టులో మొదలయ్యే శ్రీలంక పర్యటన విషయంలోనూ బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు టెస్టుల సిరీస్‌కు అదనంగా మూడు టీ20 సిరీస్ ఉండదని స్పష్టం చేంది.



# స్పోర్ట్స్

## న్యూజిలాండ్‌కు బిగ్ షాక్.. మూడో టెస్టుకు దూరమైన హెన్రీ, ఫిలిప్స్..!



కెన్నింగ్‌టన్ ఓవల్ టెస్టులో భారీ విజయంతో జోరు మీదున్న న్యూజిలాండ్ కు బిగ్ షాక్. మూడో టెస్టులోనూ గెలిచి సిరీస్ పట్టేయాలనుకున్న కివీస్ కీలక ఆటగాళ్ల సేవల్ని కోల్పోయింది. ఓవల్‌లో శతకంతో రెచ్చిపోయిన గ్లెన్ ఫిలిప్స్ 11 వికెట్లతో ఇంగ్లండ్ నడ్డి విరిచిన పేసర్ మ్యాట్ హెన్రీలు చివరి మ్యాచ్‌కు దూరమయ్యారు. దాంతో, నిర్ణయాత్మకమైన నాటింగ్‌హమ్‌లో టెస్టులో ఈ ఇద్దరు మ్యాచ్ విజేతలు లేకుండానే న్యూజిలాండ్ బరిలోకి దిగనుంది. ఇంగ్లండ్ పర్యటనలో 253 పరుగుల భారీ విజయంతో సిరీస్ సమం చేసిన న్యూజిలాండ్‌కు ఊహించని షాక్ తగిలింది. ఓవల్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో చెలరేగిన గ్లెన్ ఫిలిప్స్.. 11 వికెట్లతో జట్టును గెలిపించిన మ్యాట్ హెన్రీలు గాయం కారణంగా మూడో మ్యాచ్‌కు దూరమయ్యారు. 'ఓవల్ టెస్టు అనంతరం హెన్రీకి స్కానింగ్ చేశాం. అతడి ఎడమ కాలి పిక్క కండరాల్లో చిన్నపాటి చీలిక వచ్చింది. అతడు కోలుకునేందుకు రెండు నుంచి నాలుగు వారాలు పట్టనుంది. పక్కటెముకల నొప్పితో బాధ పడుతున్న ఫిలిప్స్ కోలుకునేందుకు ఎన్ని రోజులు పడుతుంది? అనేది తెలియాల్సి ఉంది' అని న్యూజిలాండ్ క్రికెట్ వెల్లడించింది. నాటింగ్‌హమ్ టెస్టుకు ఒక్క రోజే ముందే ఈ ఇద్దరూ అందుబాటులో లేకపోవడం కివీస్‌కు పెద్ద ఎదురుదెబ్బ అంటున్నారు విశ్లేషకులు. వీరిద్దరి స్థానంలో బెన్ సియర్స్, మిచెల్ శాంట్నర్ ఎంపికయ్యారు.

# చివరి నిమిషంలో భారత టీ20 సిరీస్ రద్దు..?

భారత్, శ్రీలంక జట్ల మధ్య ఆగస్టులో జరగాల్సి ఉన్న టీ20 సిరీస్‌పై అనిశ్చితి నెలకొంది. టీమిండియా బిజీ షెడ్యూల్ కారణంగా ఈ సిరీస్ చివరి నిమిషంలో రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆటగాళ్ల పనిభారం, భవిష్యత్ టోర్నీల దృష్ట్యా బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి భారత ఫ్యూచర్ టూర్ ప్రోగ్రామ్‌లో ఈ సిరీస్ లేదు. అయితే లంక బోర్డు అభ్యర్థన మేరకు బీసీసీఐ ఈ సిరీస్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై ఇంకా అధికారిక షెడ్యూల్ కూడా విడుదల కాలేదు. ఈ లోపే బిజీ షెడ్యూల్ దృష్ట్యా బీసీసీఐ ఈ సిరీస్‌ను డిస్మిస్ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ సిరీస్‌కు ఓ ప్రత్యేకత ఉంది. గతేడాది నవంబర్‌లో శ్రీలంకను తీవ్రంగా ప్రభావితం చేసిన 'సైక్లోన్ డిట్వా' బాధితుల సహాయార్థం ఈ సిరీస్‌ను నిర్వహించాలని అనుకున్నారు. ఈ సిరీస్‌కు కేవలం క్రికెట్ పరమైన ప్రాధాన్యమే కాకుండా మానవతా కోణం కూడా ఉండేది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఆ లక్ష్యం నెరవేరేలా లేదు. టీ20 సిరీస్‌పై అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ఆగస్టులోనే ఇరు జట్ల మధ్య జరుగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ మాత్రం యథావిధిగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టు 15 నుంచి 27 వరకు జరగనున్న ఈ టెస్టులు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (ఔజ 2025-27)లో భాగంగా జరుగనున్నాయి.



# వరుస అనౌన్స్మెంట్స్ ఓకే.. మరి ఇప్పటికైనా గాడిన పడతారా?



మాస్ మహారాజా రవితేజ అంటేనే ఫుల్ ఎనర్జీ.. వరుస సినిమాలతో దూసుకుపోవడం ఆయన స్టైల్. అయితే గత కొంతకాలంగా ఆయనకు బాక్సాఫీస్ వద్ద సరైన సక్సెస్ పడటం లేదు. ఈ నేపథ్యంలోనే మళ్లీ పాత స్పీడ్ అందుకోవడానికి రవితేజ కేవలం రెండు నెలల గ్యాప్‌లోనే రెండు భారీ ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు రెడీ అవుతున్నారు. ఒక క్రేజీ నిర్మాతతో, మరో విలక్షణ దర్శకుడితో రాబోతున్న ఈ సినిమాలు ఆయన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తెస్తాయని ఫాన్స్ గట్టిగ నమ్ముతున్నారు ..మరి ఆ విశేషాలు చూద్దాం..

**దిల్ రాజు బ్యానర్‌లో మాస్ జాతర:**

సినీ వర్గాల సమాచారం ప్రకారం.. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మాణంలో రవితేజ చేయబోయే కొత్త సినిమా షూటింగ్ వచ్చే ఆగస్టు నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు, నటీనటుల ఎంపిక వేగంగా జరుగుతున్నాయి. రవితేజను అభిమానులు ఎలా చూడాలనుకుంటున్నారో.. దానికి తగ్గట్టుగా ఒక పక్కా కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను సిద్ధం చేసినట్లు ఇండస్ట్రీలో గట్టిగా టాక్ వినిపిస్తోంది.



**వివేక్ ఆత్రేయతో ఊహించని కాంబినేషన్:**

ఆగస్టులో దిల్ రాజు సినిమా మొదలైన రెండు నెలలకే.. అంటే అక్టోబర్ నుంచి రవితేజ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి డిఫరెంట్ మేకింగ్ స్టైల్ ఉన్న వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించబోతున్నారు. ఇప్పటివరకు క్లాస్ అండ్ కంటెంట్ సినిమాలే తీసిన వివేక్.. మొదటిసారి రవితేజ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్,కామెడీ మేళవించి ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్ రాసుకున్నారట.

**ఫ్లాపుల్లో ఉన్నా తగ్గని రవితేజ మార్కెట్:**

ఇటీవల రవితేజ నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడలేదు. గత ఏడాది వచ్చిన 'మాస్ జాతర' కానీ, ఈ ఏడాది విడుదలైన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి సినిమాలు ప్రేక్షకులను పెద్దగా మెప్పించలేకపోయాయి. ఐనా సరే మాస్ మహారాజా క్రేజ్ అస్సలు తగ్గలేదు. ఇక ఆయన మార్కెట్‌పై నమ్మకంతో ఇప్పటికీ టాలీవుడ్ టాప్ నిర్మాతలు, దర్శకులు ఆయనతో సినిమాలు చేయడానికి లైన్ కడుతున్నారు.

**ఆశలన్నీ రాబోయే సినిమాలపైనే:**

వరుసగా రెండు పెద్ద ప్రాజెక్టులు లైన్‌లో పెట్టడం రవితేజ స్పీడ్‌కు నిదర్శనమే అయినా.. ప్రస్తుతం ఆయనకు ఒక సాలిడ్ బ్లాక్‌బస్టర్ హిట్ చాలా అవసరం. రాబోతున్న 'ఇరుముడి' చిత్రంతో పాటు దిల్ రాజు, వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో రాబోయే ఈ రెండు కొత్త సినిమాల్లో కనీసం ఒకటైనా గట్టిగా హిట్ కొడితేనే రవితేజ మళ్లీ ఫుల్ ఫేమ్‌లోకి వస్తారని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

వరుస అనౌన్స్మెంట్స్, షూటింగులతో రవితేజ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చిన మాట నిజమే. కానీ కేవలం స్పీడ్ మాత్రమే కాదు, ఈసారి కంటెంట్ కూడా గట్టిగా ఉంటేనే మాస్ మహారాజా బాక్సాఫీస్ వద్ద పాత వైభవాన్ని అందుకుంటారు. మరి ఆగస్టు, అక్టోబర్ నెలల్లో రాబోతున్న ఈ కొత్త ప్రాజెక్టులు రవితేజను మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తాయో లేదో వేచి చూడాలి..



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com